బమ్మెర పోతన రచించిన

శ్రీ రాఘవేంద్ర

# వీరభద్ర విజయము



బ్రహ్మశ్రీ కాశీభొట్ల సత్యనారాయణ వ్యాఖ్యానంతో

**2016**

**ISBN : 978-93-86040-14-5**

**బమ్మెర పోతన**

# వీరభద్ర విజయం

వ్యాఖ్యానం : **కాశీభొట్ల సత్యనారాయణ**

**కాపీలకు :**

**యస్.ఆర్. బుక్‌లింక్స్**

దానయ్య వీధి, మాచవరం, విజయవాడ-4.

ఫోన్ : 0866-2436959, 94919 62759

&

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలోని అన్ని బుక్‌షాపులు.

## కథా ప్రారంభము

వ. మత్సమర్పితం బగు వితత విస్ఫురిత వీరభద్ర విజయాంచితకథా ప్రసంగప్రారంభంబెట్టిదనిన మహిత మాతులుంగ మందార చందన సాల భల్లాతకీప్రముఖ రాజిత కుంభినీవిరాజితంబునుకురువింద కుంద మహిమ్లాత మధుక శతపత్ర కమల కల్హార కరవీర మల్లికాది వల్లీ సంఫుల్ల పుష్పవల్లీలలిత పరిమళ సుగంధ బంధుర దిగంత రాళంబును నిజవిరోధంబుఁ దొరంగినగతి వసియించు చంచరీక శారికా కీర నాకీల చక్ర వాక నీలకంఠ కనకనయన కంక నాళలింగక్రౌంచకారంభ కారండకానకపోత పారావత శకుని భరద్వాజ చకోర లావుక జీవంజీవ వాయ సారాతికో యష్టిక డిండిభ సారస శాతఖండనారంగత్వదారంగ గణనాదప్రమోదితంబును మండిత గండభేరుండ వేదండ కంఠీరవ శరభ శార్దూల శంబర జంబూక గవయ వరారోహ ప్లవంగ శల్య సారంగ చమరీ మృగ గోకర్ణ వృకాదిమహామృగమందిరంబును దందశూక గాధేయ మార్జాల మూషక నివాసంబును సకలపుణ్యతరంగిణీ మంగళ సంగమంబును వినిర్మలసరోవరవిలసితంబును అనుపమమునినాద నిరంతర బహుళపాఠ నిఖిలనిగమ కలకలారావఘటిత గగన తలంబును ధర్మతపోధనధాన్యదాన తాపసోత్తమ సంతత సంతుష్టహోమ ధూమసమ్మిళిత బృందారకా లోకనంబును సర్వ భువనమహారణ్య రత్నంబును సకల మునిజనస్తోత్ర పాత్రంబును నగు నైమిశారణ్యపుణ్య క్షేత్రంబునందు. 45

**వ్యాఖ్యానం :** పోతన కథా ప్రారంభం చేస్తూ – మీకు నేను అందిస్తూన్న వీరభద్ర విజయం యొక్క కథా ప్రారంభం ఏమిటంటే – అని నైమిశారణ్య వర్ణన చేస్తున్నాడు.

అది అరణ్యం. అరణ్యమంటే ఈనాటి అరణ్యాలు కావు. ఈ రోజుల్లో పెద్ద పెద్ద భవనాలు – ఫ్యాక్టరీలు – వాటి చుట్టూ పది చెట్లు. పోతన చెబుతూన్న నైమిశారణ్యం అంటే –

వందల వేలకొలది వృక్షాలు – అనేక లతా స్వరూపాలు – అనేక జాతుల పక్షులు – ఈ వాతావరణం మధ్యలో అక్కడక్కడ పర్ణశాలలు.

ఇప్పుడీ వర్ణన అర్థం కావాలి –

మాతులుంగం (మాదీఫలం), మందారం, చందనం, సాలం (మద్ది), భల్లాతవి (జీడిమామిడి) మొదలైన వృక్షాలతో ప్రకాశిస్తూన్న భూములూ, కురువింద (తుంగముస్తె), కుంద (మొల్ల), మహిమ్లాత. మధుక (ఇప్పతేనె) శతపత్ర (పద్మం) కమల (రేకులు తక్కువ తామర), కల్హారం (ఎర్రకలువ), కరవీరం – దీనికి ముళ్ళుంటాయి. రుచిగల పళ్ళుంటాయి. పండ్ల కోసం ఏనుగులు వెళ్ళి ముళ్ళు గ్రుచ్చుకొని బాధపడతాయి. మల్లిక మొదలైన లతల పూల పరిమళాలతో నిండిన దిక్కులునూ తమలో తమకున్న విరోధాల్ని మరచి సంచరించే చంచరీకాలు (తుమ్మెదలు), శారికా (గోరువంక), కీర (చిలుక), కాంకోల (చెమిటి కాకి) చక్రవాక – నీలకంఠ (నెమలి), కనక నయన కంకం – నాళలింగ – క్రౌంచ – కారంభ – కానకపోత – పారావత (పావురం) శకుని – భరద్వాజ, చకోర, లావుక – జీవం జీవ (వన్నె పక్షి – చకోరం) వాయసం (కాకి) ఆరాతి – కోయష్టిక (గుడ్డికొంగ) డిండిభ – సారస – శాతఖండనా మొదలైన పక్షిజాతుల కూతలతో ఆనందాన్ని కలిగించేదీ – అలాగే

గండభేరుండ – వేదండ (ఏనుగు) కంఠీరవ (సింహం) శరభ (రెక్కలు గల మృగం), శార్దూల (పులి), శంబర – జంబుక (నక్క), గవయ (ఆవులాటిది) వరారోహ శల్య (అడవి పంది) సారంగ (లేడి), చమరీమృగ – గోకర్ణ – వృక మొదలైన మహామృగాలకు ఇల్లు అయినదీ – అలాగే దందశూక (సర్పం), గౌధేయ (పిల్ల ఉడుములు), మార్జాల మూషకాలకు నివాసమైనదీ, పుణ్యనదులతో మంగళకరమైన సరోవరాలతో ప్రకాశించేది – మహర్షుల వేదఘోషలతో అలాగే పఠన – పాఠాలతో శబ్దించే దిక్కులతో హోమధూమాలతో – ధనధాన్యదానాలతో పరమానందకరమైనదీ – ఇదీ నైమిశారణ్యం. ఈ నైమిశారణ్యంలో ఒకనాడు

చ. పెనుపగ దీర్ఘసత్ర మనుపేరిటియాగముఁ జేసి పుణ్యులై
మును లొకకొందఱుత్తములు మోదముతో సుఖగోష్ఠి
నుండ నయ్యనిలుఁడు వచ్చి శైవకథ లన్నియు నిచ్చలుఁ
జెప్పచుండఁగాఁ దనరుచు నొక్కనాఁ డచటితాపసు లెల్లను వాయుదేవుతోన్.
46

**వ్యాఖ్యానం :** గొప్పగా ఒక యాగం చేశారు. దానికి దీర్ఘసత్రం అని పేరు. ఇది పండ్రెండు సంవత్సరాలు చేసే యాగం. యాగం పూర్తి అయింది. పెద్దలందరూ సంతోషంగా సుఖంగా కూర్చుని యాగ విషయాలు మాట్లాడుకొంటున్నారు. ఆ సమయంలో వాయుదేవుడక్కడికి వచ్చి శైవకథల్ని చెబుతున్నాడు. ఆ సమయంలో ఆ తాపసులు వాయుదేవుడితో -

ఉ. శైవకథా ప్రసంగములు శైవజనంబుల దివ్యకీర్తనల్
శైవపురాణసారములు శైవరహస్యములుఁ మహాయశ
శ్శైవర నీకు మానసము సిద్ధము నీ వెఱుగంగ రాని యా
శైవము లేదు రూపమును సారము నీకు ముఖస్థమారయన్.47

**వ్యాఖ్యానం :** మహానుభావా! శివకథలు - శైవభక్తుల కీర్తనలు - శైవ పురాణాలసారము - శైవరహస్యాలు నీ మనస్సులో స్థిరంగా ఉన్నాయి. నీకు తెలియని శైవ విషయం లేదు. శివరూపమూ, శివసారమూ నీ ముఖంలోనే కనబడతాయి. (వాయువు శివుని అష్టమూర్తులలో ఒక మూర్తి. అందుకని ఆ స్వరూపమే శివం.)

చ. శివకథ లెల్ల వేదముల చేత నెఱింగినమేటివీవ యో
పవనసురాసురేంద్రనుత భాసురపుణ్య సురాగ్రగణ్య యా
యవిరళవీరభద్ర విజయాకరసారసుధారసంబు మా
చెవులకు మన్మనోరథము చెల్వముగాఁ జిలికింపవే దయన్. 48

**వ్యాఖ్యానం :** ఓ వాయుదేవా! వేదాలలోని శివతత్త్వాన్ని పూర్తిగా తెలిసినవాడివి. నిన్ను దేవతలూ, రాక్షసులూ అందరూ గౌరవిస్తారు. కనుక మా చెవుల పండుగగా వీరభద్ర విజయం కథామృతాన్ని చిలికింపవా!

ఇక్కడ చిలికింపవా అంటే ఎంత చెప్పినా ఇంకా అనంతంగా మిగిలే ఉంటుంది అని భావం.

శ్రీ కైలాసనగేంద్ర
ప్రాకటసానుప్రదేశబహువనరాజీ
వాకరగంధసమేత
శ్రీకరవిభవాభిరామ శ్రీగిరిధామా. 1

**వ్యాఖ్యానం :** కైలాస పర్వత సానువులలో అనేక వనాల సువాసనలతో నిండిన తేజోవంతమైన వైభవంతో మనోహరుడవైన వాడా!

వ. పరమజ్ఞానభావుం డగు వాయుదేవుం డమ్మహామునుల కి ట్లనియె. 2

**వ్యాఖ్యానం :** జ్ఞానమూర్తి అయిన వాయుదేవుడు ఆ మహా మునులతో ఇలా అన్నాడు.

మ. రమణఁ ఘోరతపంబు చేసి చెలువారం బ్రహ్మ మెప్పించి లో
కము లెల్లం బరిమార్చినట్టి వెఱపుం దర్పంబుఁ దేజంబు వి
క్రమసైన్యంబును లక్ష్మియుం బడసి సంగ్రామంబులోఁ దార
కుం డమరేంద్రాదుల గెల్చి వత్తు నని దండై పోయె నత్యుగ్రుఁడై. 3

**వ్యాఖ్యానం :** ఘోరతపస్సు చేసి బ్రహ్మను మెప్పించాడు తారకుడు. ఆ శక్తితో లోకాలనన్నిటిని పరిమార్చగల శక్తి, తేజస్సు వచ్చాయి. సైన్య సంపదను పొందాడు. అప్పుడు వాడికి ఇంద్రాదుల్ని గెలవాలనిపించి మహారోషంతో బయలుదేరాడు.

వ. ఇట్లు పోయి. 4

సీ. ఆలంబులో నింద్రు నాలంబు గావించి
వహ్నికిఁ దనకోపవహ్ని చూపి
యంతకునకుఁ దాను నంతకమూర్తియై
యసురకు నసురయై యలవు మెఱసి
నీరధీశ్వరు పెంపు నీఱుగా నలయించి
గాలిబలం బెల్లఁగాలి చేసి
నెఱయంగ ధననాథు నిర్ధనుఁ గావించి
హరునిబలంబెల్ల హతముఁ జేసి

తే. యమరగంధర్వయక్షరాక్షసపిశాచ
గరుడపన్నగ మానవ గ్రహమునీంద్ర
చయము నెల్లను బలుమాఱు చంపి శౌర్య
భాసురుం డగు నత్తారకాసురుండు. 5

**వ్యాఖ్యానం :** యుద్ధంలో ఇంద్రుణ్ణి బొమ్మలా అలంకరించాడు. అగ్నికి తన కోపాగ్ని ఏమిటో చూపెట్టాడు. యముడికి యముడయ్యాడు. నైరుతికి రాక్షసుడయ్యాడు. వరుణిని వృద్ధిని నీరు చేశాడు. గాలి బలాన్ని తుస్సుమనిపించాడు. కుబేరుణ్ణి దరిద్రుణ్ణి చేశాడు. ఈశానుడి బలాన్ని హతం చేశాడు. తక్కిన దేవ గంధర్వయక్ష రాక్షసాది సర్వగ్రహాల్ని చంపి చంపి వదలిపెట్టాడు.

చ. తమతమ రాజ్యసంపదలు తద్దయుఁ జేకొని పోక వెండియుఁ
దముఁ బలుమాఱుఁదారకుఁడు తల్లడ పెట్టిననింద్రుఁడాదిగా
నమరులు లోకపాలురును నాపదఁ బొంది కలంగి బ్రహ్మలో
కమునకుఁబోయి పద్మభవుఁగాంచి ప్రణామము లాచరించుచున్.
6

**వ్యాఖ్యానం :** పట్టుకొని పోయే తమతమ రాజ్యసంపద లేమున్నాయో వాటినన్నిటినీ ఒకేసారి పట్టుకుబోక అస్తమాను వచ్చి మమ్మల్ని ఏడిపించుకు తింటున్నాడు- అని దేవతలు దిక్పతులు దుఃఖాన్ని భరించలేక బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఆయన కాళ్ళమీద పడ్డారు.

## తారకాసురుడు తమని పెట్టే బాధల్ని బృహస్పతి బ్రహ్మకు చెప్పటం

వ. సురాచార్యుండు బ్రహ్మదేవున కిట్లనియె. 7

**వ్యాఖ్యానం :** దేవతల గురువైన బృహస్పతి బ్రహ్మదేవునితో ఇట్లా అన్నాడు.

లయగ్రాహి :

ఆఁకొని కరాళగతి భీకరపుఁ జూపులను
భేకముల మూఁకలను వీఁకఁ గని యాద
ర్వీకరము మ్రింగుక్రియ నాకపులతో నిఖిల
లోకములు దారకుఁడు చేకొని హరింపన్
బ్రాకటపుఁగామినుల వీఁకఁ జెఱవట్టి మఱి
నాకముఖపట్టణము లాఁకగొని యుండన్
డాకకును గాక యిటు నీకు వినిపింప ఘన
శోకమున వచ్చితిమి గైకొను విరించీ. 8

**వ్యాఖ్యానం :** మంచి ఆకలితో తీవ్రంగా భయంకరంగా కప్పల మూకల్ని పాము మ్రింగుతున్నట్లు- దేవతలతో సహా అన్ని లోకాల్ని తారకుడు హరిస్తున్నాడు. ఆడవాళ్ళను చెరబట్టి తీసికొనిపోతున్నాడు. అమరావతిని తన స్వాధీనం చేసికొన్నాడు. వాడి దెబ్బలని గాదు. తీవ్రమైన ఈ శోకాన్ని నీకు వినిపించాలని ఇలా వచ్చాం.

క. తాపసుల నెల్లఁ జంపెను
కోపంబున సురలఁ జెఱలు గొని వర్తిల్లెన్
పాపపురక్కసునకు మీ
రేపారఁ ద్రిలోకవిజయ మిత్తురె చెప్పుఁడా. 9

**వ్యాఖ్యానం :** తపస్వుల్ని చంపాడు. దేవతల్ని చెరబెట్టాడు. ఇలాటి పాపపు (రాక్షసునికి) వెధవకి మీరు త్రిలోక విజయవరాల్ని యిస్తారా ? ఆలోచించండి.

శ్రీగౌరీఘనసుస్తన

భాగాంకిత గంధసార భాసురవక్షో

భాగ నిశానాథజటా

భాగా లోకాధినాథ పార్వతినాథా. 1

**వ్యాఖ్యానం :** పార్వతీదేవి యొక్క వక్షస్థలమందున్న మంచి గంధం అంటుకొనటం వలన ప్రకాశిస్తున్న తన వక్షస్థలం కలవాడు. చంద్రుణ్ణి తన జటాభాగంలో కలవాడు, లోకాధినాథుడైనవాడు అయిన పార్వతి నాథునకు నమస్కారం.

వ. పరమజ్ఞానభావుం డగువాయుదేవుం డమ్మహామునుల కి ట్లనియె నవ్విధంబునఁ దనకుఁ బరమేశ్వరుండు ప్రత్యక్షంబై యాదరించిన నోషధి ప్రస్థానపురంబున కరుగుదెంచి సుందరీ జనంబులుం దానును వినయవినత లై నిలిచినఁ బార్వతీదేవిని గనుంగొని ధరాధరేంద్రుండు నిజసుందరీసహితుం డై సవినయంబునఁ గౌగిలించుకొని దీవించి యమ్మహాదేవి చిహ్నంబు లవలోకించి యిట్లనియె. 2

**వ్యాఖ్యానం :** వాయుదేవుడు కథ చెబుతున్నాడు కదా ! ఆయన తరువాత విషయాన్ని ఆ మహర్షులకు చెబుతున్నాడు. ఆనందంతో పార్వతీదేవి ఓషధీ ప్రస్థానపురానికి వచ్చింది. తల్లిదండ్రులు ఆమెను చూసి ఆనందించి దీవించారు. ఆ తల్లి ముఖ కవళికలు చూసి –

## హిమవంతుడు పార్వతిని చూసి మాటలాడటం

మ. లలనా నీముఖపద్మ మెంతయు మహాలంకార మై కాంతి ని
శ్చలమై యున్నది నేడు నీనయనము ల్లంపుల్లనీలోత్పలం
బులసత్కాంతికి నీడు దోఁచినవి నీబోట్లందఱుఁ సొంపు మై
గలుగం బొంగినవార లేమి చెపుమా కాంతామణీ ధీమణీ 3

**వ్యాఖ్యానం :** అమ్మా, నీ ముఖం మహాకాంతిమంతంగా ప్రకాశిస్తోంది. నీ కళ్ళలో విచ్చుకున్న కలువ కాంతులు కనబడుతున్నాయి. నీ సఖులందరూ సంతోషంతో సొంపుగా ఉన్నారు. ఏమైందో చెప్పు.

మ. ఉవిదా నీతప మీశ్వరుం డెఱిఁగిన ట్లొప్పారెనే మించెనే
భవదూరుండును సన్నిధై నిలచెనే పాటించి మన్నించెనే
తివుటం గన్నియ సన్నిధి న్నిలచెనే తెల్లంబుగా నొండొరుల్
తవులన్నిల్చితిరే యభీష్టములు సంధానంబులై యుండునే 4

**వ్యాఖ్యానం :** తల్లీ ! నీ తపస్సును ఈశ్వరుడు గుర్తించాడా ? సంసార దూరుడైన ఆయన సంతోషించాడా ? నీ దగ్గరకు వచ్చాడా? నిన్ను అంగీకరించాడా? మీ యిద్దరూ మీమీ కోరికలకు తగినట్లుగా ఒకరినొకరు అంగీకరించుకున్నారా?

వ. అని పలుమాఱుఁ గుమారిని గీర్తించుచు దేవీ నీకు పరమేశ్వరుండు ప్రత్యక్షమైన తెఱంగు తేటపడ వినంగుతూహలంబై యున్నది వినిపింపు మని యడిగినఁ దుహి నాచలేంద్రునకుఁ బార్వతీదేవి చెలులగు జయవిజయ లిట్లనిరి. 5

**వ్యాఖ్యానం :** అని అడిగితే పార్వతి చెలికత్తెలు జయవిజయలు ఇలా వివరిస్తున్నారు.

## పార్వతి చెలులు హిమవంతుడికి జరిగిన కథను చెప్పటం

చ. వినుము గిరీంద్ర నీతనయ వేగ తపోవనభూమిలోనికిఁ
జని విమలాత్మ యై తగిలి సంతతముఁ హృదయంబులోన శం
భునిపదపూజనల్ సలిపి భూరివిచిత్రతపంబు చేసె నీ
వనజదళాక్షి మంచుకును వానకు నెండకు నోర్చి ధీరతన్. 6

**వ్యాఖ్యానం :** రాజా ! మీ కూతురు ఆ వేళ తపోవన భూమికి వెళ్ళి నిర్మలమైన మనస్సుతో శివుని పాదపూజ చేసి మంచుకు వానకు, ఎండకు సహించి తపస్సు చేసింది.

వ. ఇవ్విధంబున నశ్రాంతంబును నత్యంతఘోరంబునునగు తపంబు సేయుచుండ నొక్కనాఁడు గిరీంద్రా నీ కేమి చెప్ప నప్పర మేశ్వరుండు లీలావినోదంబున బాలుం డైవటువేషంబు దాల్చికొని యేము చరించుచున్న వనంబునకుఁ జనుదెంచి మమ్ము డగ్గరి యీ బాల యెవ్వరిబాల యని యడిగిన నేమును సముచిత భాషణంబుల మునీంద్రా యీకన్నె హిమనగేంద్రుని కన్నియయని పలికిన నతండును మాతో మఱియు నిట్లనియె. 7

**వ్యాఖ్యానం :** ఈ విధంగా ఘోరతపస్సు చేస్తుండగా ఒకనాడు పరమేశ్వరుడు బ్రహ్మచారి వేషంలో మేమున్న చోటికి వచ్చి ఈ బాలిక ఎవరని అడుగగా హిమవంతుని కుమార్తెయని చెప్పాము. అతడిలా అన్నాడు.

క. ముదితలు మీరందఱు స
మ్మదమున సేవింప రాజమందిరములలోఁ
గదలక వర్తింపఁగ సతి
యిది యేలా సేయఁ దొడఁగె నీ తప మనియెన్. 8

**వ్యాఖ్యానం :** మీరందరూ చాలా యిష్టంతో సేవిస్తూ ఉండే రాజమందిరంలో తిరిగిన సతి యింత తపస్సెలా చేసింది.

శ్రీ రమణీయవీర సరసీగణరంజితసోమ వాసవాం
భోరుహ సంభవ ప్రముఖభూరినిలింప భుజాబలప్రతా
పోరుమహాంధకారపటలోగ్రవిఖండనచండభానుగం
భీరగుణాభిరామ రణభీమ వినిర్జిత కామ శంకరా. 1

**వ్యాఖ్యానం :** ఇది ఆశ్వాస ప్రారంభంలోని ప్రార్థన పద్యం. శంకరా! అని సంబోధన! ముందువన్నీ విశేషణాలు. శ్రీ అంటే గౌరి. ఆమెతో కలిసిన వీరుడవు. శక్తి కలయిక వలన ఏర్పడిన శివుని చైతన్యం. తలపై చంద్రుని వలన సరోవరాల్ని ప్రకాశింపచేస్తున్నాడు. ఇంద్ర బ్రహ్మాది దేవతల మహా ప్రతాపమనే అంధకారాన్ని ఖండించే తీవ్రభానుడు. రణమందు భయంకరుడు. కాముణ్ణి నిర్జించిన వాడు. ఈ విశేషణాలన్నీ ముందు ముందు సంఘటనలకు అన్వయమౌతాయి.

వ. పరమజ్ఞానభావుం డగు వాయుదేవుం డమ్మహామునులతో మీరడిగిన యర్థంబు లెల్ల సవిస్తారంబుగా నెఱింగించితి. మునీంద్రులారా వీరభద్రేశ్వరుని విజయ ప్రకారంబు నిజంబు వర్ణింప బ్రహ్మదేవునకు నలవిగా దైనను నాకుం దోఁచినవిధంబున విన్నవించెద వినుం డని యిట్లనియె. 2

**వ్యాఖ్యానం :** మీరడిగినవన్నీ సవిస్తరంగా చెప్పాను. మహర్షులారా! వీరభద్రేశ్వరుని విజయాన్ని వర్ణించటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు. అయినా నాకు తోచిన విధంగా చెబుతాను.

క. మఱి వైవస్వతమన్వం
తరమున నొక కాలమందు దక్షుఁ డదక్షుం
డురుతరపాపవిచక్షుఁడు
పరఁగఁ జన్మించె ఘోరపాపాత్మకుఁడై 3

**వ్యాఖ్యానం :** వైవస్వత మన్వంతరంలో ఒక సమయాన మహాపాపి అదక్షుడు అనగా దేనికీ సమర్థుడు కాడు. అయినా వాడి పేరు దక్షుడు. మహాపాపాత్ముడై పుట్టాడు.

క. ప్రాలేయాచలమందున
వేలుపులకు నేకతంబ విహరించుటకుఁ
మేలైనచోట భూమికి
వ్రాలిన యాకాశగంగ వచ్చినచోటన్. 4

**వ్యాఖ్యానం :** దేవతలు ఏకాంతంగా విహరించడానికి తగిన ప్రదేశమూ, భూమికి ఆకాశగంగ జారిన ప్రదేశము అయిన హిమాలయమందు.

క. శివకరమై యుండెడుచో
శివదేవుని వేఱు చేసి శివకల్మషుఁడై
దివిజులఁ బిలువం దొడఁగెను
నవహితమతి నశ్వమేధయాగము సేయన్. 5

**వ్యాఖ్యానం :** శుభకరమైన చోట శివుని యందు కల్మష బుద్ధికల దక్షుడు అశ్వమేధయాగం చేయటం కోసం శివుణ్ణి వేరు చేసి తక్కిన దేవతలందరినీ పిలవటం ప్రారంభించాడు.

వ. అంత. 6

సీ. అమరేంద్ర పావక యమదానవాధీశ
వరుణాదినిఖిలదిగ్వల్లభులను
మార్తాండ మృగధరమంగళ బుధగురు
మందాది గ్రహరాజమండలంబు
కౌశిక గౌతమ కణ్వ మార్కండేయ
కాత్రి వసిష్ఠాదులైన మునులు
క్రతుకమలోద్భవ కశ్యపాంగీరస
పులహ పులస్త్యాది జలజభవులు

ఆ. అచ్యుతాది దేవతానాయకులు యక్ష
సాధ్యసిద్ధవసు భుజంగ రుద్ర
గణము లాదిగాఁగఁ గల్గువారందఱు
దక్షుమఖము చూడఁ దగిలి చనిరి. 7

**వ్యాఖ్యానం :** ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడూ మొదలైన దిక్పతుల్ని సూర్యచంద్ర బుధగురుశనీ మొదలైన గ్రహరాజుల్నీ, కౌశిక గౌతమ కణ్వ మార్కండేయ అత్రి వశిష్ఠాదుల్నీ, కౌశిక గౌతమ కణ్వ మార్కండేయ అత్రివశిష్ఠాదుల్నీ బ్రహ్మ కశ్యప ఆంగీరస పులహ పులస్త్యుల్నీ, మహావిష్ణువూ మొదలైన దేవతా నాయకుల్నీ, యక్షుల్నీ, సిద్ధుల్నీ, సాధ్యుల్నీ, వసువుల్నీ, నాగుల్నీ, రుద్రగణాల్నీ అందరినీ పిలిచాడు. అందరూ బయలుదేరారు.

వ. ఇట్లు సకల దేవతలును జనుదెంచిన వారల నుచితోపచారంబుల సంభావించి పూజించి దక్షుండు మఖంబుం జేయం దొడంగె నయ్యవసరంబున. 8

**వ్యాఖ్యానం :** వచ్చిన వారందరినీ తగిన విధంగా గౌరవించి దక్షుడు యజ్ఞాన్ని ప్రారంభించాడు.

చ. చెలువుగ వచ్చి వేదములుచెప్పిన తావుల నున్న నిర్జరుల్
బలసి మఖంబులోపలను భాగము లియ్య భుజింపఁ గోరుచో
మలహరు రామిఁదా నెఱిఁగి మాన్యులఁ దత్సభవారిఁజూచిని
శ్చలతరవాక్యదోషతమచండమరీచి దధీచి యిట్లనున్. 9

**వ్యాఖ్యానం :** ఆనందంగా వచ్చారు. వేదాలు నిర్దేశించిన చోట్లలో కూర్చున్నారు. యజ్ఞంలో భాగాలిస్తే భుజించాలని అనుకుంటూండగా పరమేశ్వరుడురాని విషయాన్ని గమనించి ఆ సభ పెద్దల్ని చూసి, కోపం వస్తే చడామడా మాట్లాడే స్వభావం గల దధీచి మహర్షి ....

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Veerabhadra+Vijayam**

* * *